



# కరపత్రం

SINCE 2014

ఆదివారం నవంబర్ 23 2025 | సంపుటి : 2 | సంచిక : 49 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4





## నగర ప్రజలను అలరించిన సాంస్కృతిక వైభవం

. మూడు రోజుల పాటు సాగిన నార్త్ ఈస్ట్ స్టేట్స్ ఫెస్ట్

. గవర్నర్, సిఎంల రాకతో మరింత శోభ







**హైదరాబాద్,నవంబర్22 :**
తెలంగాణాకు ఈశాన్య రాష్ట్రాలకు మధ్య పటిష్టమైన సాంస్కృతిక సామీప్యత, చారిత్రకంగా, సామాజిక సామీప్యత చాలా ఉంది. ప్రధానంగా తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం, మణిపూర్, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం లలో వైవిధ్యమైన సాంస్కృతిక ఆచారాలు, ఉత్సవాలు,నృత్య రీతులు, భాషల మధ్య అత్యంత సాన్నిహిత్యం కనిపిస్తుంది. ప్రధానంగా తెలంగాణా రాష్ట్ర సాధనకై జరిగిన సుదీర్ఘ పోరాటం తో 2014లో ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పాటైనది. అదేవిధంగా, స్వయంపాలన, సంస్కృతి పరిరక్షణ, ఆత్మగౌరవ పాలనకై ఈశాన్య రాష్ట్రాలు కూడా ఉద్యమాలు చేశాయి. ఫలితంగా నాగాలాండ్ 1963 లోనూ, మేఘాలయ 1972లో ఏర్పాటయ్యాయి. ఇక్కడి జానపదాల కళలు, చేనేతలకు మధ్య కూడా దగ్గరి సామీప్యత ఉంది. ఈశాన్య రాష్ట్రాలలో దేశంలోనే అత్యధిక గిరిజన జనాభా ఉండగా తెలంగాణలోనూ ఆదివాసీ, లంబాడీ, గోండు, యానాది తదితర గిరిజన తెగలున్నాయి.

2లో..




## పెన్నే కదాని తృణీకరిస్తే
# గన్నై కూల్చింది

» కవులు, కళాకారులతోనే తెలంగాణ సాకారం
» ఉద్యమకారులను నాటి పాలకులు విస్మరించారు
» చదువుకోని అందెశ్రీ రాష్ట్ర గీతం అందించిన ఘనుడు
» ఆయన లేకుండా తెలంగాణ ఉద్యమసభలు లేవు
» అందెశ్రీ సంస్మరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,నవంబర్22 :**
తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవులు, కళాకారులు కీలక పాత్ర పోషించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వారే ముందుండి ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్లారని అన్నారు. వారు లేకుంటే తెలంగాణ లేదని అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన అందెశ్రీ సంతాప సభలో సీఎం ప్రసంగించారు. ఉద్యమానికి కవులు, కళాకారులు ఇచ్చిన ఊపుతోనే తెలంగాణ సాకారమైందని, ఇది ఎవరూ కాదనలేని నిజమన్నారు. అంతేగాకాకుండా వారే తెలంగాణ ఉద్యమాన్ని భుజాన వేసుకుని మోసారని అన్నారు.. ఎన్నడూ బడికి వెళ్లని అందెశ్రీ అద్భుతమైన జయజయహే తెలంగాణ పాట రాశారు. బడికి వెళ్ళని అందె శ్రీ రాసిన జయ జయ హే తెలంగాణ గీతం రాసిన చరిత్ర తెలంగాణకు ఉంది అని రేవంత్ తెలిపారు. బాధతో.. ఉద్వేగంతో చెప్తున్నా.. తెలంగాణ రాష్ట్ర ప్రజలు జయ జయ హే తెలంగాణ పాటకు గౌరవం దక్కాలని కోరుకున్నారు. ఉద్యమంలో ప్రతి నాలుక మీద, ప్రతి వేదిక మీద జయ జయ జయహే తెలంగాణ పాట నిలిచించింది.. తెలంగాణ గీతం స్ఫూర్తి నింపిన కవులు, రచయితలను కించపరిచే విధంగా గత పాలకుల చర్యలు ఉన్నాయని సీఎం రేవంత్ అన్నారు.

మిగతాద్ది 2 లో




## విద్యా వ్యవస్థలో 'మార్పు' తేవాలన్నదే సంకల్పం

- కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో 'అగ్రగామి'గా తెలంగాణ
- యువతకు స్కిల్లింగ్, రీ- స్కిల్లింగ్, అప్ - స్కిల్లింగ్ పై ఫోకస్
- జేఎన్టీయూహెచ్ గ్లోబల్ అల్యూమ్ని మీట్' లో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్:**
విద్యా వ్యవస్థలో సమూల మార్పు తేవాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.

2 లో



## ఐబొమ్మ రవి పొంతనలేని సమాధానాలు..!

**హైదరాబాద్:**
జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఐబొమ్మ' పైరసీ సినిమా వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవి విచారణకు ఏమాత్రం సహకరించడం లేదు. విచారణలో పొంతనలేని సమాధానాలు చెబుతున్నాడు.



## మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్

♦ వరుస ఎన్‌కౌంటర్ల తరవాత 37మంది లొంగుబాటు ♦ లొంగిపోయిన వారిలో కేంద్రకమిటీ సభ్యులు ఆజాద్
♦ గణపతి తదితరులంతా అజ్ఞాతం వీడి రావాలన్న డిజిపి

**హైదరాబాద్,నవంబర్22 :**
మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. వరుస ఎన్‌కౌంటర్ల తరవాత తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 25 మంది మహిళా మావోలు ఉండగా.. 12 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు వంటి పలువురు అగ్రనేతలు ఉన్నారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టుల నుంచి పోలీసులు భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. 303 రైఫిల్స్, జీ-3 రైఫిల్స్, ఎకె47లు, భారీగా బు÷-లలెట్స్ స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల సాంబయ్య అలియాస్ ఆజాద్, నారాయణ అలియాస్ రమేశ్, సోమ్‌దా అలియాస్ ఎర్ర ఉన్నట్లు డీజీపీ వెల్లడించారు.

2లో..




## 9మంది నాన్ కేడర్ ఎస్పీల బదిలీ

**హైదరాబాద్,నవంబరు 22 :**
తెలంగాణలో తొమ్మిది మంది నాన్ క్యాడర్ ఎస్పీలను ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటెలిజెన్స్ ఎస్పీలుగా పీ కరుణాకర్, ఎస్వీఎన్ శివరామ్, ఆర్ జగదీశ్వర్‌రెడ్డిని బదిలీ చేసింది. సైబరాబాద్ ఎస్‌బీ డీజీపీగా వైవీఎస్ సుధీంద్ర, సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీగా సాయిశ్రీ నియామకమయ్యారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీగా వి అరవింద్ బాబు, వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీగా ధార కవిత, గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా ఎం రవీందర్‌రెడ్డి, సీఐడీ ఎస్పీగా ఎన్ అశోక్ కుమార్ బదిలీ నియామకమయ్యారు. ఇదిలా ఉండగా శుక్రవారం ప్రభుత్వం 32 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసిన విషయం తెలిసిందే. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఉన్నతాధికారుల బదిలీలు చేపట్టింది. 32 మంది అధికారులను బదిలీ చేస్తూ సీఎస్ రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.




## సేవే ధర్మం.. ప్రేమే మార్గం

» తన సందేశాలతో బాబా పరివర్తన
» లక్షల మందికి తాగునీటి వసతి సౌకర్యం
» పేదలకు ఉచితంగా వైద్య సేవల కల్పన
» సాయి శతజయంతి ఉత్సవాల్లో సిఎం చంద్రబాబు

2 లో


**పుట్టపర్తి,నవంబర్22:**
సత్యసాయి బాబా తన సందేశాలతో చాలామందిలో పరివర్తన తెచ్చారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పుట్టపర్తిలో శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నీటి సమస్య లేకుండా బాబా అనేక ప్రాజెక్టులు నెలకొల్పారు. విరాళాల రూపంలో వచ్చిన నిధులను ప్రాజెక్టుల నిర్మాణానికి వినియోగించారు. అనేక గ్రామాల్లో లక్షల మందికి తాగునీరు అందించారు. ఎన్నో వైద్యాలయాలు స్థాపించారు. సత్యసాయి ట్రస్టుకు లక్షల మంది వాలంటీర్లు ఉన్నారు. మానవ సేవే మాధవ సేవ అని నమ్మి సత్యసాయి ఆచరించారు.



2లో

## ఇసుక అక్రమ రవాణా కోసం చెక్‌డ్యామ్‌ను కూల్చిన దుండగులు!

**ఓదెల:**
పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల గ్రామం వద్ద మానేరు వాగుపై ఉన్న చెక్ డ్యామ్‌ను దుండగులు కూల్చివేశారు. దీంతో నీరు దిగువకు వెళ్తోంది.



2లో..

## అనర్హత నోటీసు..
## మరికొంత సమయం కోరనున్న దానం!


**హైదరాబాద్:**
పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబును కలిశారు. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

## భారీ భూ కుంభకోణంపై భాజపా ఎందుకు స్పందించటం లేదు

**హైదరాబాద్:**
పారిశ్రామిక అవసరాల కోసం 50-60 ఏళ్ల కిందట కేటాయించిన భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.
" భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో.. అజామాబాద్ పారిశ్రామిక




భూములను క్రమబద్ధీకరించినప్పుడు.. ఎస్‌ఆర్‌ఓ రేట్ల కంటే 100% నుంచి 200% అధికంగా వసూలు చేయాలని ఒక చట్టం చేశాం.




## అల్పపీడనంతో తెలంగాణకు వర్ష సూచన

**హైదరాబాద్,నవంబరు 22 :**
తెలంగాణలో రాగల రెండురోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

# నగర ప్రజలను అలరించిన సాంస్కృతిక వైభవం

మొదటిపేజీ తరువాయి

అయితే, ఈ ఇరు ప్రాంతాల మధ్య కళా, సాంస్కృతిక, చారిత్రక, క్రీడా, వ్యవసాయ సంస్కృతిక బంధం మరింత పటిష్ట అయ్యే విధంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, హైదరాబాద్‌లో మొట్టమొదటిసారిగా తెలంగాణ నార్త్ ఈస్ట్ కనెక్ట్, టెక్నో-కల్చరల్ ఫెస్టివల్ కు రూపకల్పన చేయడమే కాకుండా, తెలంగాణ ప్రభుత్వ సహకారంతో అద్భుతంగా నిర్వహించారు. నవంబర్ 20 ,21 ,22 తేదీల మధ్య జరిగిన ఈ తెలంగాణ నార్త్ ఈస్ట్ ఫెస్టివల్ నభూతో, నా భవిష్యత్ మాదిరిగా జరిగింది. కర్త, కర్మ, క్రియ అన్నీ తానుగా పర్యవేక్షించిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఈ ఫెస్టివల్ విజయానికి పరోక్ష కారకులయ్యారు. తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోపాటు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఈశాన్య రాష్ట్రాల గవర్నర్లు పాల్గొన్న ప్రారంభ సమావేశంతో మొదలైన ఈ మూడు రోజుల కళా, సాంస్కృతిక, క్రీడా, సామాజిక ఉత్సవం 22వ తేదీన ముగిసింది. ఫైన్ ఆర్ట్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, లిటరేచర్, విమెన్ ఎంపవర్మెంట్, ఫిలిం ఫెస్టివల్, స్పోర్ట్స్ రంగాల్లో ఇరు ప్రాంతాల మధ్య ఉన్న బంధాన్ని తెలియచేసేవిధంగా అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానంగా ఫైన్ ఆర్ట్స్ రంగంలో ఇరు ప్రాంతాలకు చెందిన పెయింటింగ్స్, ఫోటో ప్రదర్శనలు, ఫ్యాషన్ షోలు,సాహిత్య చర్చలు నిర్వహించారు. లిటరేచర్ లో సాహిత్య అకాడమీ గ్రహీతలైన గోరటి వెంకన్న, అలక్ నంద దాస్ గుప్త, అంపశయ్య నవీన్,అనిందయో రాయ్, గీతా రామస్వామి లాంటి ప్రముఖులు పాల్గొన్నారు. మహిళా సాధికారత, స్పోర్ట్స్, ఫిలిం ఫెస్టివల్ లను అద్భుతంగా నిర్వహించారు. ప్రధానంగా, ఐమాక్స్ లో నిర్వహించిన ఫిలిం ఫెస్టివల్ లో త్రిపుర, సిక్కిం,అస్సామి,మేఘాలయ, మణిపూర్ రాష్ట్రాల ప్రముఖ సినిమాలతోపాటు తెలంగాణాకు చెందిన బలగం, పొ÷-టటెల్, నా బంగారు తల్లి, మల్లేశం లాంటి సినిమాలను ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో ప్రముఖ నటులు ప్రియదర్శి, దిల్ రాజు, తమ్మారెడ్డి భరద్వాజ, ప్రియాంక, ఈశాన్య రాష్ట్ర నటులు, దర్శకులు పాల్గొన్నారు.తెలంగాణా- ఈశాన్య రాష్ట్రాల క్రీడలపై చర్చా గోష్ఠులు, ఫుట్ బల్ ప్రదర్శన మ్యాచ్ లు అద్భుతంగా జరిగాయి. ప్రధానంగా, ఇరు ప్రాంతాలకు చెందిన సృజనాత్మకతను ప్రతిబింబించేలా నిర్వహించిన ఫ్యాషన్ షో హైలెట్ గా నిలిచింది. నవంబర్ 22 న హైటెక్స్ లో జరిగిన ముగింపు సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ లు పాల్గొనడంతో ఈ మూడు రోజుల కార్యక్రమాలు అద్భుతంగా ముగిశాయి. తిరిగి, రెండవ విడత కార్యక్రమాలు నవంబర్ 25 వ తేదీ నుండి 27 వరకు హైదరాబాద్ లో జరుగనున్నాయి.

# మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్

మొదటిపేజీ తరువాయి

మిగతా 34 మంది మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని తెలిపారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, తొమ్మిది మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, 22 మంది దళ సభ్యులు ఉన్నట్లు చెప్పారు. అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు వీరంతా జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకొచ్చినట్లు డీజీపీ వెల్లడించారు. లొంగిపోయిన వారంతా తమ ఆయుధాలను కూడా అప్పగించినట్లు తెలిపారు. 37 మందికి తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేలు అందజేశారు. ఆజాద్‌పై రూ.20 లక్షలు, అప్పాస్ నారాయణపై రూ.20 లక్షల రివార్డు ఉంది. వీరితోపాటు లొంగిపోయిన మావోయిస్టులందరిపైనా కలిపి మొత్తం రూ.1.41కోట్ల రివార్డు ఉంది. ఆ మొత్తాన్ని వారికే అందజేస్తాం అని తెలిపారు. తెలంగాణకు చెందిన వారికి ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీ అందిస్తాం. మిగతావాళ్లు కూడా తొందరగా లొంగిపోవాలని సూచిస్తున్నాం అన్నారు. తెలంగాణకు చెందిన మరో 59 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు. వారిలో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, పాక హనుమంతు అలియాస్ గణెళిశ్,బడె చొక్కారావు అలియాస్ దామోదర్ ఉన్నారు. అంతేకాకుండా రాష్ట్ర కమిటీలో 10 మంది ఉన్నారు. వీళ్లంతా వీలైనంత త్వరగా లొంగిపోవాలని సూచిస్తున్నాం అని డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. మావోల లొంగుబాటు సందర్భంగా ఆయన పలు అంశాలు వివరించారు. ఏ రకంగా బయటికి వచ్చినా.. మావోయిస్టులను అన్ని విధాలుగా ప్రభుత్వం చూసుకుంటుందని డీజీపీ అన్నారు. మీడియా ద్వారా వచ్చినా, ప్రభుత్వ ఉద్యోగులు ద్వారా వచ్చినా, రాజకీయ నాయకుల ద్వారా వచ్చినా తాము స్వాగతిస్తామని డీజీపీ పేర్కొన్నారు. మావోయిస్టులు పార్టీ పరంగా విబేధాలు, ఆరోగ్య కారణాలు, ఇలా అనేక కారణాలతో బయటికి వస్తున్నారని డీజీపీ తెలిపారు. 'తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడుగా ఉన్న ఆజాద్ 30 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నాడు. ములుగు జిల్లాకు చెందిన ఆజాద్ మీద రూ.20లక్షల రివార్డ్ ఉంది. అప్పాసి నారాయణ మీద రూ.20లక్షలు రివార్డ్ ఉంది. మిగతా వారికి రూ.25 వేలు చొప్పున ఇస్తున్నామని డీజీపీ తెలిపారు. 11 నెలల్లో 465మంది మావోయిస్టులు లొంగిపోయారని, వీరిలో 59మంది తెలంగాణకు చెందిన వారని డీజీపీ వెల్లడించారు.

# సేవే ధర్మం.. ప్రేమే మార్గం

మొదటిపేజీ తరువాయి

భగవాన్ సాయి సిద్ధాంతం ప్రపంచమంతా వ్యాపించింది. దాన్ని మనమంతా అర్థం చేసుకోవాలని చంద్రబాబు అన్నారు. లవ్ ఆల్.. సర్వ్ ఆల్, ఎప్పుడూ సేవ చేస్తూనే ఉండాలని... ఎవ్వరినీ నొప్పించకూడదు అనేది సత్యసాయి బాబా సిద్ధాంతమని చంద్రబాబు నాయుడు అన్నారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసా అనే ఈ ఐదు సూత్రాలను సత్యసాయి బాబా చెప్పేవారని గుర్తు చేశారు. సత్యసాయి బాబా చెప్పిన సిద్ధాంతాలు.. సూత్రాలను పాటిస్తే ప్రపంచం శాంతిగా ఉంటుందన్నారు. ఆంధ్రా, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో తాగు నీటి సౌకర్యాన్ని కల్పించారని తెలిపారు. తాగు నీటి ప్రాజెక్టు కోసం అవసరమైతే ప్రశాంతి నిలయాన్ని తాకట్టు పెట్టాలని సత్యసాయి బాబా భావించారన్నారు. కానీ ఆయన అభిప్రాయాన్ని తెలుసుకున్న భక్తులు... పెద్ద ఎత్తున విరాళాలు సేకరించి తాగు నీటి ప్రాజెక్టులకు నిధులను సమకూర్చారని ఆనాటి సంగతులను గుర్తుచేశారు. ఇప్పటికీ అదే స్ఫూర్తిని సత్యసాయి బాబా భక్తులు కొనసాగించడం తనకు సంతోషాన్ని ఇస్తోందన్నారు. సత్యసాయి బాబాతో తనకు మంచి అనుబంధం ఉందని సీఎం గుర్తుచేశారు. వివిధ ప్రాణాంతక రోగాల బారిన పడిన వారిని సత్యసాయి బాబా ట్రస్టు ఆదుకుంటోందని సీఎం పేర్కొన్నారు. మానవ సేవే... మాధవ సేవ అనే సిద్ధాంతాన్ని సత్యసాయి బాబా ట్రస్టు అమలు చేసి చూపిస్తోందన్నారు. శాంతికి బ్రాండ్ అంబాసిడర్ లాగా సత్యసాయి బాబా నిలుస్తారని చెప్పుకొచ్చారు. 7.50 లక్షల మంది వాలంటీర్లు సత్యసాయి బాబా ట్రస్టు ద్వారా సేవలందించారని... ఏ వ్యవస్థకు ఇంతటి శక్తి లేదన్నారు. ఇవాళ సత్యసాయి ట్రైబల్ ఉమెన్ హెల్త్ కేర్ ప్రోగ్రాం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఏమైనా ప్రకృతి వైపరీత్యాలు వస్తే సత్యసాయి బాబా స్ఫూర్తితో సేవలందిస్తారన్నారు. ధనవంతులు, పెద్ద ఉన్నతాధికారుల కుటుంబాలకు చెందిన పిల్లలను ప్రశాంతి నిలయానికి పంపి సేవా కార్యక్రమాలు చేయిస్తారన్నారు. 140 దేశాల్లో 2 వేలకు పైగా బ్రాంచ్‌లు సత్యసాయి బాబా ట్రస్టుకు ఉన్నాయన్నారు. భగవాన్ సత్యసాయి బాబా భక్తులు శాంతికి అంబాసిడర్లుగా నిలవాలని కోరారు. సత్యసాయి సాయిబాబా సిద్ధాంతాన్ని సర్వత్రా వ్యాపించేలా కృషి చేయాలన్నారు. రాష్ట్రపతి ముర్ము జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా కోసం చెక్‌డ్యామ్‌ను కూల్చిన దుండగులు!

మొదటిపేజీ తరువాయి

శుక్రవారం రాత్రి దుండగులు చెక్‌డ్యామ్‌ను కూల్చివేసినట్లు అధికారులు భావిస్తున్నారు. ఘటనాస్థలికి చేరుకుని నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించారు. వాగులోని ఇసుకను అక్రమ రవాణా చేసేందుకే దుండగులు ఈ పనికి ఒడిగట్టారని అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో చెక్ డ్యామ్‌కు చెందిన 3 ప్యానళ్లు ధ్వంసం అయినట్లు అధికారులు వెల్లడించారు. ఇటీవల రూ.23 కోట్లకుపైగా నిధులతో ఈ చెక్ డ్యామ్ నిర్మాణం చేపట్టారు.

# పెన్నే కదాని తృణీకరిస్తే గన్నై కూల్చింది

మొదటిపేజీ తరువాయి

అందెశ్రీ పాట లేకుండా తెలంగాణ ఉద్యమంలో ఒక్క సభ కూడా జరగలేదని గుర్తు చేశారు. ఊరూరా పాటలతో అందెశ్రీ ఉద్యమానికి ఊపిరిలూదారని అన్నారు. కానీ, తెలంగాణ సాకారమైన తర్వాత ఆ పాట మూగబోయింది. ఆయనను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పాలకుల దృష్టిలో పదేళ్లు మూగబోయి ఉండొచ్చు కానీ.. తెలంగాణ ప్రజల గుండెల్లో నిత్యం గానమై నిలిచిందన్నారు. . తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వారిని కనుమరుగు చేసే ప్రయత్నం ఆనాడు జరిగిందన్నారు. కవి రాసే పెన్నుల మీద మన్ను కప్పితే.. అవి గన్నులై మొలకెత్తుతాయ్.. మీ గడీలను కుప్పకూలుస్తాయ్ అన్న నినాదాన్ని అందెశ్రీ నిజం చేశారని సిఎం రేవంత్ అన్నారు. ప్రజలు కోరుకున్న జయ జయహే తెలంగాణను.. రాష్ట్ర గీతంగా ప్రకటించడమే కాకుండా.. ప్రతి బడిలో పాడాలి, పాఠ్య పుస్తకాల్లో రాయాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఎంత అమాయకంగా కనిపిస్తారో.. అంత చైతన్యవంతులని తెలంగాణ ఉద్యమమే రుజువు చేసిందన్నారు. ఈ గడ్డ మీద ప్రజలు అహంకారాన్ని, అధిపత్యాన్ని సహించలేరని, అందుకు నడుస్తున్న చరిత్రే సాక్షాత్కారమని అన్నారు. ఎన్ని వజ్రాలు ఉన్నా.. కోహినూరు వజ్రం ప్రత్యేకం. అలాగే ఎందరు కవులు ఉన్నా.. డా.అందెశ్రీ ప్రత్యేకంఅని సీఎం అన్నారు. తెలంగాణ ప్రాంతం ఎంత ప్రేమ చూపిస్తుందో.. అంతే పోరాటాన్ని కూడా చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలు, కవులు, కళాకారులూ ఎన్నో పోరాటాలు చేశారు.. గతంలో నిజాం సర్కార్ వాళ్ళను సైతం ఎదురొడ్డి పోరాడిన చరిత్ర తెలంగాణకు ఉందని సీఎం చెప్పారు. గద్దర్, గోరేటి వెంకన్న వంటి ఉద్యమకారులు తెలంగాణ మలి దశ ఉద్యమాన్ని రూపకల్పన చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం జయ జయ హే తెలంగాణ పాటను ప్రభుత్వం గుర్తించింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన రావాలని అందె శ్రీ, గద్దర్ అన్న లాంటి వాళ్ళ స్ఫూర్తి తోనే ఏర్పడింది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వారి కుటుంబాలకు అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నాం. వారి కుటుంబాలకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం 9 మంది ఉద్యమ కారులను గుర్తించడం జరిగింది. అంతేకాకుండా రాబోయే రోజుల్లో ఫ్యూచర్ సిటీలో వారి కుటుంబానికి ఇళ్లను నిర్మించి అండగా నిలుస్తాం. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర తెలంగాణ ఉద్యమ కారులది. దేశంలో ఎస్సి వర్గీకరణ అమలు చేసిన చరిత్ర తెలంగాణ రాష్ట్రానిది. వర్గీకరణ అనేది ప్రభుత్వంలో భాగస్వామ్యం అయ్యేలా ఉండాలి.. అలాగే సమాజాన్ని ముందుకు నడిపించాలానే ఉద్దేశంతో నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రమంత్రి వర్గంలో దళితులకు పెద్ద పీట వేయడం అనేది సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఆకాంక్షల మేరకే నిర్ణయాలు తీసుకున్నాం.' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.సమాజంలో ఎన్ని వజ్రాలు ఉన్నా కోహినూర్ వజ్రనిదే అసలైన గొప్పతనం.. అలాగే కళాకారులు ఎంతమంది ఉన్నా అందె శ్రీ అన్న.. కోహినూర్ వజ్రంలా నిలుస్తాడు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఆచార్య కోదండరాం, మాజీ ఎంపీ వి.హనుమంతరావు పలువురు కవులు, గాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీ చిత్రపటం వద్ద అందరూ నివాళి అర్పించారు. జయజయహేతో సభ మార్మోగింది. అందెశ్రీ అమర్ రహే అన్న నినాదాలు మిన్నంటాయి.

# విద్యా వ్యవస్థలో 'మార్పు' తేవాలన్నదే సంకల్పం

మొదటిపేజీ తరువాయి

నేటి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను అత్యుత్తమ నైపుణ్యమున్న మానవ వనరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో స్కిల్లింగ్, రీ- స్కిల్లింగ్, అప్-స్కిల్లింగ్‌పై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. కూకట్ పల్లిలోని జేఎన్టీయూ హెచ్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన 'జేఎన్టీయూహెచ్ గ్లోబల్ అల్యూమ్ని మీట్ - 2025'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్య మిస్తోందని వివరించారు. క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో తెలంగాణను అగ్రగామిగా నిలిపేలా 'ఎకో సిస్టం'ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. 'ఏఐ'లో బెంచ్ మార్క్‌ను సెట్ చేసేలా అంతర్జాతీయ నిపుణుల భాగస్వామ్యంతో త్వరలోనే 'తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్'ను అందుబాటులోకి తెస్తున్నామన్నారు.

మనం జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలను మరిచిపోవద్దని, సమాజానికి తిరిగి ఇవ్వడం కృతజ్ఞతతో కూడిన బాధ్యత అని అన్నారు. మనం మన విధులను సక్రమంగా నిర్వర్తించినప్పుడే ప్రశ్నించే అవకాశాన్ని పొందగలమన్నారు. జేఎన్టీయూహెచ్ లో ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్, ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఫండింగ్, రీసెర్చ్ క్లస్టర్స్, ఇంటర్నేషనల్ మెంటార్ షిప్ నెట్ వర్క్, గ్లోబల్ అల్యూమ్ని కౌన్సిల్ ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని పూర్వ విద్యార్థులను కోరారు. ఈ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. యువ ఇంజనీర్ల ఆలోచన విధానం మారాలని, ఉద్యోగార్థిగా కాకుండా పది మందికి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని మార్గనిర్దేశం చేశారు. కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా ప్రాక్టికల్, ప్రాబ్లం సాల్వింగ్ స్కిల్స్ ను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టా రెడ్డి, జేఎన్టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వర రావు, రెక్టార్ డా.కె.విజయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మహిళలకు నాణ్యమైన చీరలు

## ఇందిరమ్మ చీరల పంపిణీలో మంత్రి శ్రీహరి

ఇందిరా మహిళా శక్తిలో భాగంగా మక్తల్ పట్టణంలో మహిళలకు శనివారం ఇందిరమ్మ చీరలను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం మహిళలను నాణ్యమైన చీరలు అందజేస్తుం దన్నారు. ప్రధానమంత్రిగా ఇందిరమ్మ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబాలతో పాటుగా, రాష్ట్రం, దేశం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యమన్నారు. హాస్టల్ పిల్లలకు డైట్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలను పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. డిసెంబర్ ఒకటిన రూ.4,500 కోట్ల బ్జడెట్‌తో మక్తల్- నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని వివరించారు. మక్తల్- నారాయణపేట 4 లేన్ ల రహదారికి, నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్, అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తదితరులు పాల్గొన్నారు

# పార్టీకి తెలయచేసి లొంగిపోయాం ఇప్పుడున్న స్థితిలో ఇక ఉద్యమించలేం

## ఆరోగ్యం కూడా సహకరించడం లేదన్న ఆజాద్

మేం పార్టీకి చెప్పే లొంగిపోయామని మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు సాంబయ్య అలియాస్ ఆజాద్ తెలిపారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో జనజీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టు పార్టీ పిలుపునిస్తుందని పేర్కొన్నారు. స్టేట్ కమిటీలో ఉన్న ఇంకా ఇద్దరు అగ్రనేతలు కూడా లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. తామంతా జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని నిర్ణయం తీసుకున్నామని దండకారణ్యం స్పెషల్ జోన్ సభ్యుడు ఎర్రా తెలిపారు. మారుతున్న పరిస్థితుల్లో ఉద్యమాన్ని నడిపించడం కష్టమని పేర్కొన్నారు. మా ఆరోగ్య పరిస్థితులు కూడా సహకరించడం లేదని చెప్పారు. మిగతా మావోయిస్టులు కూడా లొంగిపోవడం మంచిదని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యాల సాంబయ్య అలియాస్ ఆజాద్, అప్పాసి నారాయణ అలియాస్ రమేశ్, సోమ్‌దా అలియాస్ ఎర్రా ఉన్నట్లు డీజీపీ తెలిపారు. మిగతా 34 మంది ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో 25 మంది మహిళలే ఉన్నట్లు తెలుస్తోంది. లొంగిపోయిన వారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, 9 మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, 22 మంది దళ సభ్యులు ఉన్నట్లు డీజీపీ చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు నగదుతోపాటు మరికొన్ని వెసులుబాట్లు కూడా కల్పిస్తామని చెప్పారు. ఆజాద్‌పై రూ.20 లక్షలు, అప్పాసి నారాయణపై రూ.20 లక్షల రివార్డు ఉందని డీజీపీ తెలిపారు. వీరితో పాటు లొంగిపోయిన మావోయిస్టులు అందరిపైనా కలిపి మొత్తం 1.41 కోట్ల రివార్డు ఉందని పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని వారికే అప్పగిస్తామని చెప్పారు. తెలంగాణకు చెందిన వారికి ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీ అందిస్తామని తెలిపారు. తెలంగాణకు చెందిన మరో 59 మంది మావోయిస్టులు ఉన్నారని.. వారు కూడా తొందరగా లొంగిపోవాలని పిలుపునిచ్చారు.

# అనర్హత నోటీసు..

## మరికొంత సమయం కోరనున్న దానం!

మొదటిపేజీ తరువాయి

అనంతరం ఆయన స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసే అవకాశం ఉంది. స్పీకర్ ఇచ్చిన అనర్హత నోటీసుకు సమాధానం ఇచ్చేందుకు మరికొంత సమయం కోరనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ విషయంపై ఏఐసీసీ పెద్దలతో దానం సంప్రదింపులు చేశారు. ఎమ్మెల్యేగా రాజీనామా, ఇతర అంశాలపై చర్చించినట్లు సమాచారం. తాను రాజీనామా చేస్తే.. తిరిగి తనకే టికెట్ ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరినట్లు తెలుస్తోంది. అనర్హత వేటు వేసేందుకు అవకాశం ఉంటే రాజీనామా చేస్తానని సన్నిహితులకు దానం చెప్పినట్లు సమాచారం.పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులకు సమాధానాలు ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మరోసారి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 23వ తేదీలోగా సమాధానాలను అఫిడవిట్ రూపంలో స్పీకర్ కార్యాలయంలో అందజేయాలని వాటిలో సూచించారు.

# ఐబొమ్మ రవి పొంతనలేని సమాధానాలు..!

మొదటిపేజీ తరువాయి

తనను ఏమీ అడిగినా గుర్తు లేదు.. మరిచిపోయా అనేది మాత్రమే చెబుతున్నాడు. ఈరోజు(శనివారం, నవంబర్ 22వ తేదీ) మూడో రోజు విచారణలో భాగంగా పోలీసులకు ఐబొమ్మ రవి సహకరించలేదు. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు అడిగితే.. గుర్తు లేవు.. మరిచిపోయా అని మాత్రమే సమాధానం చెప్పినట్లు తెలుస్తోంది.

ఎథికల్ హ్యాకర్ల సహాయంతో హార్డ్ డిస్క్ లు, పెన్ డ్రైవ్‌లు ఓపెన్ చేస్తున్నారు పోలీసులు. ఫ్రాన్స్, నెదర్లాండ్స్ లో మెయిన్ సర్వర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే బ్యాంక్ ఖాతాల వివరాలపైనా రవి నోరు విప్పడం లేదు. దాంతో రవి అకౌంట్ల చిట్టా ఇవ్వాలని పలు బ్యాంకులకు మెయిల్ చేశారు పోలీసలు. ప్రతీ 20 రోజులకు ఒక్కో దేశానికి వెళ్లడంపై రవిని ఆరా తీయగా, విదేశీ పర్యటనలు అంటే ఇష్టం ఉండటం వల్లే వెళ్ళాను అని చెప్పినట్లు సమాచారం.కాగా, సినిమా పైరసీ కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్న ఐబొమ్మ ఇమ్మడి రవికి నాంపల్లి హైకోర్టు ఐదురోజుల పోలీసు కస్టడీ విధించిన సంగతి తెలిసిందే. వారం రోజుల పోలీసు కస్టడీ కోరిన సైబర్ క్రైమ్ పోలీసులు.. కేసులో ఉన్న సాంకేతిక అంశాలు, డిజిటల్ ఆధారాలు, నెట్‌వర్క్ లింకులు తదితరాలను విశ్లేషించేందుకు రవిని ప్రత్యక్షంగా విచారించాల్సిన అవసరం ఉందని కోర్టుకు వివరించారు. కోర్టు ఈ పిటిషన్‌ను పరిశీలించి ఐదు రోజుల కస్టడీకి అనుమతి ఇచ్చింది. దీనిలో భాగంగా ఇప్పటివరకూ మూడు రోజుల విచారణ పూర్తి కాగా, ఇంకా రెండు రోజుల మాత్రమే మిగిలి ఉంది.

# భారీ భూ కుంభకోణంపై భాజపా ఎందుకు స్పందించటం లేదు హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 30 శాతానికే అప్పగించాలని చూస్తోంది. 7 రోజుల్లో దరఖాస్తులు? 7 రోజుల్లో ఆమోదాలు? 45 రోజుల్లో పూర్తి క్రమబద్ధీకరణ? ఎవరికి లాభం చేకూర్చడానికి ఈ వేగవంతమైన ప్రక్రియ? రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు తీరని నష్టం చేస్తున్నారు. రూ.5లక్షల కోట్లు రావాల్సిన భూములకు కేవలం రూ.5వేల కోట్లు మాత్రమే ఎలా వస్తాయి? రెండు సంవత్సరాల బడ్జెట్‌కు సరిపడా నిధులు వచ్చే నిర్ణయాన్ని ఏకపక్షంగా ఎలా తీసుకుంటారు.

మంత్రిమండలి, అసెంబ్లీలో చర్చించకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారు? రూ.లక్షల కోట్ల విలువైన భూములను ఆగమేఘాల మీద ఎలా అప్పగిస్తారు? రెండు నెలల్లోనే ప్రక్రియ అంతా పూర్తి చేయటం వెనుక కుట్ర ఏమిటి? భూములను బహిరంగ మార్కెట్‌లో వేలం వేస్తే.. రూ.5లక్షల కోట్లు వస్తాయి. ప్రభుత్వ అవసరాలకు కూడా భూమి లేకుండా ఎలా విక్రయిస్తున్నారు. కాలుష్య కారక పరిశ్రమలను మాత్రమే ఓఆర్‌ఆర్ అవతలకు పంపించాలనేది పాలసీ. కానీ, ఈ ప్రభుత్వం గ్రీన్ ఇండస్ట్రీలను కూడా బయటికి పంపిస్తోంది. 9,290 ఎకరాల భూముల ద్వారా కాంగ్రెస్ నేతలు జేబులు నింపుకొంటున్నారు. పరిశ్రమల కోసం ఇచ్చిన భూములను మల్టీపర్పస్ అవసరాలకు ఎలా అనుమతిస్తారు. భారీ కుంభకోణంపై కేంద్రంలోని భాజపా ఎందుకు స్పందించటం లేదు” అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# అల్పపీడనంతో తెలంగాణకు వర్ష సూచన

మొదటిపేజీ తరువాయి

మలక్కా జలసంధిలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం ఉదయం 8.30 గంటలకు దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడిందని వాతావరణశాఖ తెలిపింది. పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. ఆ తర్వాత పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ తర్వాతి 48 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో మరింత బలపడే ఛాన్స్ ఉందని తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో ఆదివారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. పలుచోట్ల పొగమంచు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొంది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. సోమవారం సైతం పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందని వివరించింది. మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల పొడి వాతావరణం ఉంటుందని వివరించింది.

# రాష్ట్ర భక్తి .. రాజ్య శక్తి
# రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

**RSS ఉద్భవించి వందేళ్లు అయింది.**
ఈ శతాబ్ద కాలంలో వామన అవతారం నుండి విరాట్ స్వరూపం దాల్చింది ఆరెస్సెస్.
ఆరెస్సెస్ అంటే భారతీయులందరికీ ఒక ప్రేమ నమ్మకం. సంస్థ పట్ల తరిగిపోని విశ్వాసం నిండి ఉన్నది.

**» ఆరెస్సెస్ అతి సామాన్యంగా పనిచేస్తుంది. ఈ అసామాన్య కార్య పద్ధతి ద్వారానే ఆరెస్సెస్ మహా శక్తి స్వరూపంగా ఎదిగింది**

ఆరెస్సెస్ చాలా సింపుల్ గా పనిచేస్తుంది.
ఆరెస్సెస్ వ్యక్తిత్వాన్ని నిర్మిస్తుంది.వ్యక్తి నిర్మాణం చేస్తుంది. దానితో ఆ వ్యక్తి పరిపూర్ణ భారతీయుడిగా ఎదుగుతాడు.
అలా భారత దేశంలో పరిపూర్ణ వ్యక్తిత్వంతో ఎదిగి నిలుచున్న వారు జాతికి మార్గదర్శకులుగా మారుతున్నారు.

**» ఆరెస్సెస్ ను అందరూ ప్రేమిస్తారు.ఆరెస్సెస్ ను విమర్శించేవారు కూడా సంస్థ పనితీరును ప్రశంసిస్తారు**
**» ఆరెస్సెస్ ద్వారా వ్యక్తిగత శీలాన్ని అలవర్చుకున్నవారు, అజేయ జాతీయ శీలానికి ప్రతిరూపంగా వెలుగుతారు**

ఆరెస్సెస్ ఎవ్వరినీ శత్రువులుగా భావించదు.
ఆరెస్సెస్ నిర్మాణాత్మక కార్యక్రమం అర్థం కానివారు కొందరు విమర్శలు చేస్తుంటారు.
ఆరెస్సెస్ వ్యక్తిని స్వయం నియంత్రణ కలిగిన కార్యకర్తగా తయారు చేస్తుంది.
ఆరెస్సెస్ ను ఎవ్వరూ అదుపు చేయలేని పారదర్శక సంస్థగా ఎదిగింది.ఎవరి అదుపూ లేని అజేయ సంస్థ ఆరెస్సెస్.

**» ఆరెస్సెస్ మీద అదుపు ఒక్క స్వయం సేవక్ కు మాత్రమే ఉంది**



**» డాక్టర్ హెడ్గేవార్ ఈ వ్యవస్థను ఎలా నిర్మాణం చేశారో అంతు బట్టకుండా ఉంది...**
మొదటి నుంచీ ఆయన చాలా తెలివిగా సంఘం మీద ఆయనకు అదుపు లేకుండా చేసుకున్నారు

కేంద్రీకృతంగా కనిపించే పూర్తి వికేంద్రీకరణ పద్ధతి ఆరెస్సెస్ ది.


**» ఒక అయస్కాంతంలో ఉన్న ప్రతి కణమూ స్వయంగా ఒక అయస్కాంతంలా పనిచేస్తున్నట్టు వ్యవస్థ నిర్మాణం చేసారు**

**» మామూలు అణువులను కూడా ఒకే దిశలో పనిచేసేట్టు చేస్తే .. అది అయస్కాంతంగా మారి పోతుందని ఈ ప్రక్రియ కనిపెట్టారేమో !**

ఎక్కడికక్కడ దేశం గురించి, హిందూ సంఘటన గురించి ఆలోచించే వాళ్ళు కలిసి, శారీరిక మానసిక దృఢత్వం పెంచుకునే పని చేస్తారు.

**» అలాంటి ఏ ఆలోచనా లేనివాళ్ళు ఈ అయస్కాంతానికి ఆకర్షితమయ్యి మెల్లగా వాళ్ళు కూడా ఈ ప్రక్రియలో భాగం అయిపోతారు**

ఇలా చెయ్యాలి..ఇలాగే ఉండాలి అని పై నుండి ఏ కమాండ్స్ రావు.
కేవలం ఇదిగో మన సంఘటన బలపడాలంటే...అక్కడ ఈ పద్ధతిని




అనుసరించారు...మరో చోట అలా...అని చెబుతూ సూచనలు చేస్తారంతే.

**» ప్రతి రోజూ ఒక గంట కలిసి చేసేవి మాత్రం ప్రార్థన...ఏకాత్మతా స్తోత్రం...మిలటరీ డ్రిల్ లాంటి క్రమశిక్షణ పద్ధతి .. అంతే ఆరెస్సెస్ అంటే**

కబడ్డీ లాంటి ఆటలు...ఉత్సాహంగా చేసే నినాదాలు .. భారత మాతకు జయ జయ కారాలు .. ఇంతే .. ఆరెస్సెస్ అంటే ఇంతే.

**» విచిత్రం ఏంటంటే...ఆరెస్సెస్ కు అసలు రహస్య కార్య కలాపాలు అంటూ ఏమీ లేవు**

ఆ శాఖలోనే మొత్తం మర్మం అంతా దాగుంది.

**» విమర్శకులకు అర్థం కానిది, దీన్ని నడిపించేది ఎవరన్నది ఇప్పటికీ ఎవ్వరికీ అర్థం కాని విషయం**

ఆరెస్సెస్ ను నడిపించే శక్తి ఏమిటో విమర్శకులకు ఇప్పటికీ తెలియడం లేదు.

**» పని చేసేవాడు సహజంగా నాయకుడు అయిపోతాడు. ప్రత్యేక పరిస్థితులలో నాయకుడుగా మారిన వ్యక్తి కార్యకర్త అయిపోయి పని నేర్చుకుంటాడు**

ఇద్దరికీ ఒకే గౌరవం.
ఇలా పరస్పరం ముందుకు త్రోసుకుని బాధ్యతలు పంచుకోవడం ఆరెస్సెస్ ప్రత్యేకత.
పని చేసే విధానంలోవైరుధ్యం ఉన్నా...వ్యక్తిగత ఇష్టాఇష్టాల ప్రభావం ఉన్నా...శాఖలో అటెన్షన్ ఆజ్ఞ ఇస్తే... అటెన్షన్ .. అంతే.
దక్ష అన్న ఆదేశం అందరినీ అలర్ట్ చేస్తుంది. ఇది అనిర్వచనీయమైన అనుశాసనం. ఇది ఆరెస్సెస్ ప్రత్యేకత.

**» దేశంలో ఆపద .. దేశానికి ఆపద .. అది ప్రతి ఆరెస్సెస్ కార్యకర్త ఆపదగా మారుతుంది. ఈ పరిస్థితి వస్తే ప్రతి కార్యకర్తా అసంకల్పితంగా ముందుకు ఉరకడమే ఆరెస్సెస్ పనివిధానం**

ఇందులో దశాబ్దాలుగా పని చేసే వాళ్ళకే,ఇది ఎందుకు జరుగుతోందో, ఎలా జరుగుతోందో అర్థం కాకపోతే .. పాపం బయటి వాళ్ళకి ఏం అర్థం అవుతుంది?..

ఆరెస్సెస్ అకారణంగా ద్వేషించే వాళ్లను చూసి ప్రతి ఆరెస్సెస్ కార్యకర్త జాలిపడడం తప్ప ప్రతి విమర్శ చేయడు. సమయం వృథా చేయడు.

**» దేశం అంటే ఏమిటో అర్థం కాని వాళ్లకు, దేశ ద్రోహ బుద్ధి ఉన్నవాళ్ళకి... ఆరెస్సెస్ సాక్షాత్తూ కాళికా స్వరూపమే**

ఆరెస్సెస్ ఒక దైవీ శక్తి ప్రతిరూపంగా ఎదిగి నిలుచున్నది.

**» దేవ భూమి, వేద భూమి, కర్మ భూమి, ధర్మభూమి, పుణ్య భూమి అయిన ఈ భారత భూమిని నిరంతరం రక్షిస్తూ ఉన్న జాతీయ శక్తి ఆరెస్సెస్. భారత దేశాన్ని శక్తి వంతంగా ఉంచడం కోసం ఆదిశక్తి ఆరెస్సెస్ అవతారం ఎత్తిందనిపిస్తుంది**

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పుట్టి వందేళ్లు అయింది. ఇది ఆరెస్సెస్ శతాబ్ది సంవత్సరం.

**» ఆరెస్సెస్ భారతీయులందరిదీ.ప్రతి వ్యక్తి ఆరెస్సెస్ శాఖకు రావాలి. ఆరెస్సెస్ శాఖకు రావడం అంటే తనను తాను తెలుసుకోవడం.దేశాన్ని తెలుసుకోవడం**

శాఖకు రావాలి, ముఖ్యంగా విమర్శకులు ఆరెస్సెస్ శాఖకు రావాలి.ఎందుకంటే ఆరెస్సెస్ ను విమర్శించాలంటే ఆరెస్సెస్ గురించి సంపూర్ణంగా తెలుసుకోవాలి కదా!

**» దేశ నిర్మాణంలో సర్వం సమర్పించి పనిచేసి అమరులైన స్వయం సేవకులందరికీ వందనాలు. దేశం కొరకు అహరహం తపిస్తూ పనిచేస్తున్న స్వయం సేవకులకు అభివందనాలు**

తనను తాను కరిగించుకుని తనకంటూ ఏ గుర్తింపు కోరుకోకుండా మార్గదర్శనం చేసిన, చేస్తున్న ఆరెస్సెస్ పెద్దలందరికీ సంఘ శతాబ్ది వందనాలు.
చందనం లాంటి ఈ నేల మట్టిని నుదుట తిలకంగా దిద్దుకుని సర్వం త్యాగం చేసిన ప్రచారకులకు శిరసా నమామి.

**భారత్ మాతా కి జై.**

## ఇందిరమ్మ ఇండ్లకు డబ్బులడిగితే రోకలి బండతో కొట్టండి

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**



కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, ఇందిరమ్మ ఇండ్లకు డబ్బులు వసూలు చేస్తున్నారని వస్తున్న ఫిర్యాదులపై స్పందిస్తూ, నాయకులు, అధికారులు, సిబ్బంది ఎవరైనా డబ్బులు అడిగితే రోకలి బండతో కొట్టాలని లబ్ధిదారులను కోరారు. మెట్పల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం, ఎమ్మెల్యే కోటాలో మంజూరైన 63 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ ను ఆయన అందజేశారు.

## రాజారాం ట్రస్ట్ చైర్మన్ విద్యార్థులకు ఏకాగ్రతపై శిక్షణ




**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలంలోని వెల్లుల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు శనివారం రాజారాం ట్రస్ట్ చైర్మన్, సైకాలజిస్ట్ డాక్టర్ జి. రాజరత్నాకర్ ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందించుకోవడం, విజయం సాధించడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకుని, ఆనందంగా విజయపథంలో ముందుకు సాగాలని, తద్వారా కుటుంబానికి, దేశానికి ఉపయోగపడాలని ఆయన సూచించారు.

## ఒక్కసారి చూస్తే ఇట్టే పట్టేస్తుంది

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**



చర్లపల్లి రైల్వే టెర్మినల్లో భద్రతను పటిష్టం చేసేందుకు ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నిషన్) కెమెరాల వ్యవస్థను ఏర్పాటు చేశారు. మొత్తం 250 కెమెరాలను అమర్చారు. నేరస్థులు, అనుమానితుల కదలికలను గుర్తించేందుకు ప్రవేశ మార్గాలు, టిక్కెట్ కౌంటర్లు, విశ్రాంతి గదుల వద్ద 15 ముఖ్యమైన కెమెరాలను ఏర్పాటు చేశారు.

## రోడ్ పనులను పరిశీలించిన
### - బీఆర్ఎస్ నేతలు



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు, చర్లపల్లి డివిజన్ పరిధిలోని మీనాక్షి నగర్ లో చేపట్టిన సీసీ రోడ్ పనులను డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నేమూరి మహేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్ని విధాలా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐక్యతా యాత్రలో ఎమ్మెల్యే సంజయ్

**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**



సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా కోరుట్లలో నిర్వహించిన ఐక్యతా యాత్ర (Unity March) జిల్లాస్థాయి పాదయాత్ర కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ దేశ ఐక్యత, సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి ఆలోచనల ప్రాముఖ్యత, యువత దేశ నిర్మాణంలో తీసుకోవాల్సిన బాధ్యతలను వివరించారు. విద్యతో పాటు క్రమశిక్షణ, సమాజ సేవ, దేశభక్తి వంటి విలువలను జీవితంలో అలవరచుకోవాలని సూచించారు. యువత చైతన్యం దేశ అభివృద్ధికి శక్తి అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్, ఎమ్మార్వో తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలు

అర్హులైన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరను అందజేస్తామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మనోజ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. పిట్లం మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో మండల అధ్యక్షురాలు సత్యవా అధ్యక్షతన జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి చేరాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వయం సహాయ సంఘాల మహిళలకు చీరలను అందజేశారు. ప్రతి మహిళకు ఇందిరా శక్తి చీరలను పంపిణీ చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## తిరుపతి కోసం పోలీసుల గాలింపు

**కొండబత్తిని అమర్ నాథ్,కరపత్రం కోరుట్ల**



ఏపీలో జరిగిన ఎన్ కౌంటర్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందిన తర్వాత మావో పార్టీ ప్రధాన కార్యదర్శి కోరుట్ల వాసి తిరుపతి (దేవ్) హాట్ టాపిక్‌గా మారారు.ఆయన తప్పించుకున్నారా! పోలీసుల అదుపులో ఉన్నారా! అనే అనుమానాలు ఉన్నాయ్.అక్కడి అధికారులు తమ అదుపులో లేరని ప్రకటించడంతో భద్రతా బలగాలు ఆయన కోసం గాలిస్తున్నాయి.

## కోరుట్ల ఫిల్టర్ బెడ్ పరిశీలించిన అదనపు కలెక్టర్



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం ప్రతినిధి**
జగిత్యాల జిల్లా కోరుట్ల మండల కేంద్రంలోని తాళ్లచెరువు ఫిల్టర్ బెడ్ ను అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ శనివారం పరిశీలించారు. పట్టణ ప్రజలకు సకాలంలో నీరు అందించాలని, ఫిల్టర్ బెడ్ ను, నీటి స్వచ్ఛతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రవీందర్, సంబంధిత అధికారులు ఆయన వెంట ఉన్నారు

## అభినందన పత్రం అందజేత

రామగిరి మండలం , 8వ కాలనీలో భాస్కర్ రావునగర్ లో నివసించే బండారి శ్రీనివాస్(41) ఇటివల మరణించగా శ్రీనివాస్ నేత్రాలను సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేకరించడం జరిగిందని తెలిపారు. శనివారం వారి స్వగృహంలో స్పందన స్కూల్ ఓదెల అధ్యక్షతన సదాశయ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డి ప్రధాన కార్యదర్శి చౌడవరపు లింగమూర్తి, గౌరవ సలహాదారులు నూక రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించి ఘనంగా నివాళు లర్పించారు. బంధుమిత్రులకు నేత్ర అవయవ శరీర దానాలపై అవగాహన కల్పించి నేత్రదాత ఆత్మశాంతికి మౌనం పాటించి ఘనంగా నివాళులు అర్పించడం జరిగిందన్నారు. కుటుంబ సభ్యులు భార్య స్వర్ణలత, తల్లి నాగమణి, కొడుకులు నాగ సుప్రీత్ ,శివ సాకేత్ , బావమరిది వోడ్నాల రాజేంద్ర ప్రసాద్ , వారి పెదనాన్న బండారి రాజ రాజ మౌళిలకు అభినందన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర ప్రసాద్, శ్రీకాంత్ కుల బంధువులు పాల్గొని నేత్రదాతకు ఘనంగా నివాళులు అర్పించారు.విషాదంలో ఇద్దరు అంధులకు వెలుగులు ప్రసాదించడానికి నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, భీష్మాచారి, కే.ఎస్.వాసు, లగిశెట్టి చంద్రమౌళి, మారెల్లి రాజిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు వెల్ది కవిత, అనంతరాములు అభినందించారు.

# వైభవంగా శ్రీ సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాలు

- బాబా చూపిన మార్గం ఆదర్శనీయం
- ఆధ్యాత్మిక గురువు గంగా శంకర్



**మంథని కరపత్రం ప్రతినిధి**

భగవాన్ శ్రీ సత్యసాయిబాబా చూపిన మార్గం భక్తులకు ఆదర్శనీయమని ఆధ్యాత్మిక గురువు గంగా శంకర్ పేర్కొన్నారు. సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం మంథని పట్టణంలోని సత్యసాయి మందిరంలో ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక కార్యక్రమములో ఆయన ప్రసంగించారు. తన సోదరుడు స్వర్గీయ గంగా మహాదేవ్ నెలకొల్పిన ఈ ఆలయంలో అనేక సేవా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుండడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని తెలిపారు. కలియుగంలో మానవులకు ఆధ్యాత్మిక మార్గం ఒక్కటే ఆదర్శనీయమన్నారు. చివరి రోజున సంగీత విభావరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అష్టదని గంగాధర్, ప్రముఖ కామెంటేటర్, క్రీడా విశ్లేషకులు మహావాది సుధీర్, రామడుగు మారుతి, కొమురవెల్లి విజయకుమార్, మేడగోని రాజమౌళి గౌడ్ తోపాటు భక్తులు పాల్గొన్నారు.

**శ్రీ సత్య సాయి బాబా భగవస్వరూపులు :**

1926 నవంబర్ 23న అనంతపురం జిల్లా పుట్టపర్తి గ్రామంలో శ్రీ సత్య సాయి బాబా పెద్ద వెంకటరాజు ఈశ్వరమ్మ దంపతులకు జన్మించారు. 14 సంవత్సరాల వయసులో ఆధ్యాత్మికత వైపు అడుగులు వేస్తూ కోట్లాది మంది భక్తులకు ఆధ్యాత్మిక గురువుగా రూపాంతరం చెందారు. కులమతాలకు అతీతంగా బాబా చూపిన మార్గాన్ని భక్తులందరూ ఇప్పటికీ అనుభవిస్తుండడం విశేషం. సత్య సాయి బాబా తండ్రి ఒకసారి నీవు ఎవరు అని ప్రశ్నించగా తాను షిరిడి సాయిబాబా ప్రతిరూపమని తనకు ఎవరితోనూ సంబంధం లేదని చెప్పడంతో అప్పటినుండి కోట్లాదిమంది భక్తులు సత్యసాయిని దర్శించుకోవడం ఆయన సేవలో నిమగ్నం అవ్వడం ప్రారంభమైంది. 1944లో భక్తులు పుట్టపర్తి లో శ్రీ సత్య సాయి బాబా ప్రశాంతి నిలయం మందిరాన్ని నిర్మించారు. 1954లో పుట్టపర్తి లో బాబా హాస్పిటల్ నిర్మించారు. 1957 లో సత్య సాయిబాబా దేశంలోని అనేక పుణ్యక్షేత్రాలు సందర్శించారు. 1963లో సత్యసాయికి 4 సార్లు గుండెపోటు రావడం జరిగింది. భగవస్వరూపుడైన బాబాకు ఎలాంటి ఆపద సంభవించలేదు. 1968లో బాబా మొదటిసారిగా విదేశీ పర్యటనకు వెళ్లారు. అన్ని దేశాల్లోనూ బాబా తాను అన్ని మతాలను సమానంగా చూస్తానని ప్రేమను పంచడానికి మాత్రమే వచ్చాను అని చెప్పడంతో లక్షలాదిమంది భక్తులు లక్షలాదిమంది విదేశీ భక్తులు బాబాకు భక్తులుగా మారడం విశేషం. బాబా ప్రదోపకరమైన అభివృద్ధి కార్యక్రమాలకు అంకురార్పణం చేశారు. బాబా కొనసాగించిన ఈ కార్యక్రమాలను ఇప్పటికి కొనసాగిస్తుండడం విశేషం. ప్రశాంతతకు నిలయంగా పుట్టపర్తి గ్రామం విరసిల్లుతుంది.

## కాకతీయ లో ఎస్.ఎల్.సి. ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

- విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభకు నిదర్శనం
- పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి






**మంథని, కరపత్రం ప్రతినిధి**

పెద్దపల్లి జిల్లా మంథని లోని కాకతీయ హై స్కూల్ లో శనివారం ఏర్పాటు చేసిన ఎస్.ఎల్.సి.(స్కూల్ లీడ్ కాన్ఫరెన్స్) కార్యక్రమంలో అందరినీ ఎంతో ఆకట్టుకుంది. ఎల్ కేజీ నుండి 5 తరగతి విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్ట్ లతో ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలలో నైపుణ్యం గుర్తించి విద్యార్థులు స్వతహాగా వివిధ రకాల ప్రాజెక్ట్ తయారు చేయడం వారి నైపుణ్యతకు నిదర్శనమని ఆయన తెలిపారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, వివరంగా వివరించి చెప్పడం జరిగిందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని ప్రదీప్ రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు వారిలో దాగి ఉన్న నైపుణ్యతను గుర్తించడం కాకతీయ పాఠశాల యొక్క ప్రత్యేకతగా ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రవికిరణ్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, స్రవంతి రెడ్డి, పావని రెడ్డి,లీడ్ అకాడమిక్ అడ్వైజర్ అరుణ్, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నేటి నుండి అయ్యప్ప ఆలయ 24వ వార్షికోత్సవం







**యైటింక్లయిన్ కాలనీ కరపత్రం ప్రతినిధి**

పారిశ్రామిక ప్రాంతంలోని శ్రీ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ 24వ వార్షికోత్సవాలు మూడు రోజుల పాటు ఆలయంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు కాల్వ చంద్రశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ వార్షికోత్సవంలో సజీవ నంబూద్రి, గురుస్వామి ఆశీస్సులతో, ఆలయ గురుస్వామి అద్దెంకి సారంగాచారి, ఆలయ అర్చకులు దేవ్ ప్రకాష్ పాండే ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23న ఆదివారం ఉ. 6 గంటల నుండి గోపూజ,గురు ప్రార్థన, గణతి పూజ, స్వస్తిపుణ్యాహవాచనం నాంధీ పంచగవ్య ప్రాశన,మాలాధారణ అఖండ దీప స్థాపన, ధ్వజారోహణం, యాగశాల ప్రవేశము, నవగ్రహ, యోగిని,వాస్తు, క్షేత్రపాలిక, సర్వతో భద్ర మండల దేవత స్థాపన మూలమంతా జప తర్పణాదులు

గణపతి, నాగరాజ్ స్వామికి ఫల పంచామృతాభిషేకములు, తీర్థ ప్రసాద వితరణ, మధ్యాహ్నం 1 గం.కు అన్న ప్రసాద వితరణ,24న సోమవారం ఉ:6.00 గం.ల నుండి గణపతి ప్రార్థన, స్థాపిత దేవతారాధనలు,

మాలికాపురోత్తమ్మ అమ్మవారికి ఫల పంచావృతాభిషేకములు, గణపతి హోమం,మహా మంగళప్రద రుద్ర సహిత చండీ హవనం, మూలమంత్ర జప హోమములు బలి ప్రధానము స్థాపిత దేవతారాధనలు, రాజోపచార సేవ , తీర్థ ప్రసాద వితరణ, 25న మంగళవారం ఉ. 6 గం.ల నుండి గణపతి ప్రార్థన, దేవాలయములకు శిఖరమునకు సుబ్రహ్మణ్య స్వామికి, అయ్యప్ప స్వామి మూలవిరాట్ లకు వివిధ మంగళ ద్రవ్యాలతో ఫల పంచామృతాలతో

మహా అభిషేకము, మహా పూర్ణాహుతి దేవాలయ సంప్రోక్షణ, అవబృతం, మహా హారతి మహా మంత్రపుష్పం, వైదిక నిర్వహణ బ్రహ్మశ్రీ ఖండవల్లి ఆదిత్య శర్మ చే బ్రాహ్మణ మహాదాశీర్వచనం ఉంటుందని అన్నారు. సాయంత్రం 6:30 గంటలకు ఆలయ గురుస్వామి అద్దెంకి సారంగాచారిచే మహా పడిపూజ మహోత్సవం, హారతి హరివరాసనం, తీర్థ ప్రసాద వితరణ అల్పాహారం ఉంటుందని అన్నారు. కావున భక్తులు సపరివారంగా పూజ కార్యక్రమములకు విచ్చేసి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## బెజ్జంకి జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ దివాస్ వేడుకలు



**బెజ్జంకి, కరపత్రం ప్రతినిధి**

బెజ్జంకి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వేరోస్ నెట్వర్క్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొర్ర సురేష్ కుమార్ స్వేరో ఆధ్వర్యంలో డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ (ఐపీఎస్%–%రిటైర్డ్) జయంతి సందర్భంగా శనివారం ప్రతిజ్ఞ దివస్ వేడుకలు నిర్వహించారు. నా స్వప్నం – నా లక్ష్యం వ్యాసరచన పోటీల్లో వి. ఉమేష్ చంద్ర (I బహుమతి), ఎస్. ఖిత (II), కె. మమత (III), డి. అక్షిత (కన్సొలేషన్) బహుమతులు అందుకున్నారు.

ముఖ్య అతిథులుగా హాజరైన మెట్ల శంకర్, బోనగిరి ప్రభాకర్ విద్యార్థులు లక్ష్యంతో చదవాలని, తల్లిదండ్రులు పిల్లలను ఫోన్లకు దూరంగా ఉంచి చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు.

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దేవస్వామి, అధ్యాపక బృందం, స్వేరోస్ జిల్లా ఉపాధ్యక్షుడు చిలుముల మోహన్, కామ శ్రీనివాస్ శంకర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తక్కువ సిబ్బంది ఎక్కువ ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్.పేరుకు మాత్రమే హెడ్ మాస్టర్

- ప్రాథమిక పాఠశాలల్లో ప్రత్యేక సిబ్బందిని వెంటనే నియామకం చేయాలి
- ఎస్ జి టి ఫోరమ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అనిల్ కుమార్ రెడ్డి డిమాండ్.

**కరీంనగర్ కరపత్రం ప్రతినిధి నవంబర్ 22**

బోధనేతర కార్యక్రమాల వల్ల నాణ్యమైన విద్యా బోధన చేయలేక పోతున్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు.ఒకప్పుడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు బోధనకు పరిమితం అయ్యి సమాజానికి విలువలతో కూడిన విద్యార్థులను అందించడం జరిగింది అనే విషయం అందరికీ విధితమే నేడు వివిధ రకాల బోధనేతర కార్యక్రమాల వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు నానా రకాలుగా ప్రయాసపడుతున్నారు. ఉదయం ప్రార్థన చేయించే పి.ఈ టిలు లేకపోవడంతో ఎస్ జి టి లలో ఎవరో ఒకరు ఆ బాధ్యత తీసుకొని ప్రార్థన సజావుగా అయ్యేట్టు తమది కానీ వృత్తి నిర్వర్తిస్తున్నారు.తదుపరి ఫేషియల్ జనరల్ అటెండెన్స్, విద్యార్థుల సంఖ్య ను బట్టి మధ్యాహ్న భోజన కార్యక్రమం, పాఠశాలకు హాజరు కానీ విద్యార్థుల ఇంటికి వెళ్ళి విషయాలు సేకరించడం, వెంటనే రాగి జావ చేయించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు రావడం , ఆ తదుపరి మధ్యాహ్న భోజన వివరాలు ఆన్లైన్ లో అప్లోడ్ చేయడం, మరి కాసేపటికే మధ్యాహ్న భోజనం వడ్డించడం ,ఆ వెంటనే విద్యార్థుల మూత్ర శాలలు పరిశుభ్రంగా ఉన్నాయో లేవో పరిశీలించి తగు ఏర్పాట్లు చేయడం, పలు రకాల కారణాలతో పాఠశాలను సందర్శించే తల్లి తండ్రుల సందేహాలు తీర్చడం, ఆ వెంటనే బడి తోట పని, ఆ వెంటనే విద్యార్థుల కు లైబ్రరీ పుస్తకాలు చదివించడం, అవకాశం దొరికితే ఏదైనా ఒక తరగతి కి పాఠం చెప్పడం, ఆ వెంటనే విద్యార్థులకు మళ్ళీ విరామ సమయం రావడం, ఆ సమయంలో విద్యార్థుల కు ఆటల పీరియడ్ సక్రమంగా జరిగే విధంగా చూడటం, ఆటల్లో ఎవరికైనా స్వల్ప గాయాలు తగిలితే ,ఆ గాయాలు తగిలిన విద్యార్థులకు ప్రథమ చికిత్స నిర్వహించి తల్లి తండ్రులకు సమాచారం ఇవ్వడం ,ఆ వెంటనే అధికారుల ద్వార స్ప్రెడ్ షీట్స్ డేటా వెంటనే నింపాలని వాట్సప్ సమాచారం రావడం , ఇలా ఒకటా?? రెండా?? అసలు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు అధికారులు కనీస అవసరాలు తీసుకునే సమయం అయినా ఇస్తున్నారా?? అసలు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మానవ హక్కులు వర్తిస్తాయా?? అనే సందేహం కలుగుతుంది.

అక్టోబర్ 2025 నుండి మధ్యాహ్న భోజన బిల్లులు ఆన్లైన్ లో రూపొందించాలి అనే అదనపు కార్యక్రమం ప్రవేశ పెట్టడం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు తలకు మించిన భారంగా మారింది. గతంలో

మధ్యాహ్న భోజన బిల్లులను రక రకాల ఫార్మాట్ లలో నింపడం జరిగింది, ఎస్ సి ఎస్ టి జనరల్ స్టూడెంట్స్ బిల్లులు ఎగ్ బిల్లు, జనరల్ బిల్లు, ఎస్ సి బిల్లు, యస్ టి కుక్ కం హైపర్ బిల్లు తయారు చేసి సమర్పించడం జరిగేది. అక్టోబరు 2025 నెల నుండి ఆన్లైన్ లో మధ్యాహ్న భోజన బిల్లులు తయారు చేసి అధికారులకు సమర్పించడం అదనం.

ఉన్నత పాఠశాలల్లో బోధనేతర కార్యక్రమాలు నిర్వహించడం కోసం ప్రత్యేక సిబ్బందినీ కేటాయిస్తున్న ప్రభుత్వ అధికారులకు, ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు అనుభవిస్తున్న శ్రమ కనిపించడం లేదా?? ప్రాథమిక పాఠశాలల పట్ల అధికారులు ఎందుకు నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రాథమిక పాఠశాలలో ఉన్నటువంటి సమస్యల పరిష్కారం కోసం ప్రాథమిక పాఠశాలలలో వెంటనే బోధనేతర కార్యక్రమాల నిర్వహణ కొరకై సిబ్బందిని నియమించాలి.అని ఎస్ జి టి ఫోరమ్ తెలంగాణ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్

చేస్తున్నాముజి

మధ్యాహ్న భోజన బిల్లులు ఎంఆర్సి లో ఉండే సిబ్బందితో చేయించాలని ఎస్జీటీ ఫోరం తరుపున ప్రభుత్వాన్ని

## మోడల్ పాఠశాలలో బాలికల హక్కులపై అవగాహన సదస్సు




**బెజ్జంకి, కరపత్రం ప్రతినిధి**

జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి%–%బేటీ బచావో బేటీ పడావో పథకం భాగంగా, బాల్య వివాహ నిషేధ చట్టం%–%2006 పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని శనివారం మండల కేంద్రమైన బెజ్జంకిలోని మోడల్ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిహెచ్ఈడబ్ల్యూ బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు.

కార్యక్రమంలో లింగసమానత్వం, బాల్యవివాహాల నిషేధ చట్టం, బాల్యవివాహాల ప్రభావాలు, శిశు హక్కులు, సహాయ కేంద్రాలు మరియు అత్యవసర సహాయ హెల్ప్‌లైన్ నంబర్లు (1098, 100, 112, 181, 1930) వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో బాల్యవివాహ నిర్మూలన ప్రతిజ్ఞ చేయించడంతో పాటు, కిశోరి గ్రూపుల ఏర్పాటుపై సూచనలు, గ్రీవెన్స్ బాక్స్ వ్యవస్థపై వివరాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రతినిధి ఏ.పద్మ, గిరిజ శక్తి, పాఠశాల ప్రిన్సిపల్ మాలోతు సంగీత ఉపాధ్యాయులు, అంగన్వాడి సూపర్వైజర్ నాగరాణి, పాఠశాలలో అభ్యసిస్తున్న బాలికలు పాల్గొన్నారు.

## భారత్ ను విశ్వ గురువుగా నిలిపే మహా యజ్ఞంలో పాల్గొందాం రండి

- బూర్ల దక్షిణామూర్తి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తెలంగాణ ప్రాంత సదస్యులు.



**కరీంనగర్ కరపత్రం ప్రతినిధి**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రారంభించి 100 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా జన్మ శతాబ్ది ఉత్సవాలు దేశమంతా ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా నవంబర్ 23 నుంచి డిసెంబర్ 10వ తారీకు వరకు ఇంటింటి జనజాగరణ కార్యక్రమం ఆర్ఎస్ఎస్ చేపట్టింది.

ఇందులో భాగంగా రామచంద్రపూర్ కాలనీ లో ఉత్సవాల ప్రారంభ సందర్భంగా ఇంటింటికి పంపిణీ చేసే కరపత్రాలు, స్టిక్కర్ లను స్థానిక హనుమాన్ ఆలయంలో ఉంచి పూజలు నిర్వహించడం జరిగింది .దేశమంతా సౌభాగ్యంతో, సాంస్కృతిక వికాసంతో పరిఢవిల్లాలని కోరుకోవడం జరిగింది. తదనంతరం ప్రధాన వక్తగా విచ్చేసిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రాంత కార్యకారిణి సదస్యులు బూర్ల దక్షిణామూర్తి ఈ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడుతూ సమర్థ భారతాన్ని నిర్మించే దిశగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పనిచేస్తుందని, డాక్టర్ కేశవ బలిరాం హెడ్గేవార్ స్థాపించిన ఆర్ఎస్ఎస్ నేటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదని, ప్రపంచంలోనే అతిపెద్ద సామాజిక సేవా సంస్థగా రూపుదిద్దుకొని ముందుకు వెళ్తున్నదని వారు తెలిపారు.

హిందుత్వం ఒక ఆరాధన పద్ధతో లేక మతమో కాదని ఇది ఒక జీవన పద్ధతి అని ,ధర్మం ఆధారంగా సమాజాన్ని ఐక్యంగా ఉంచే ఒక విశాల భావన ఆర్ఎస్ఎస్ అనుసరిస్తుందని వారు తెలిపారు.

వ్యక్తి నిర్మాణమే దేశ నిర్మాణంగా భావిస్తూ సంఘ కార్య పద్ధతి ద్వారా భరతమాతను, భగవాధ్వజంను ప్రధాన ఆరాధ్య దైవాలుగా భావించి సామాజిక వికాసం దిశగా ఈ సంస్థ పనిచేస్తుందని వారు పేర్కొన్నారు.

సంఘ శతాబ్ది సందర్భంగా సమాజంలో సామాజిక సమరసత, పర్యావరణ పరిరక్షణ, స్వ ఆధారిత జీవనం, పౌరవిధుల ఆచరణ, కుటుంబ ప్రబోధన్ ప్రధాన అంశాలుగా సంస్కృతి పరిరక్షణ ధ్యేయంగా సంఘం ముందుకు వెళు తుందని కావున ప్రజలందరూ ఈ జన్మ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా పంచ పరివర్తనను పాటిస్తూ సామాజిక సమరసతకు తోడ్పడుతూ సాంస్కృతిక వికాసం తద్వారా దేశ పరమ వైభవ స్థితి సాధించుటకు భారత్ను విశ్వ గురువుగా నిలుపుటకు కంకణబద్దులు కావాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక మాజీ కార్పొరేటర్ శ్రీమతి చొప్పరి జయశ్రీ వేణు మాట్లాడుతూ

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ధర్మ పరిరక్షణకు భారతీయ సాంస్కృతిక వికాసానికి అహర్నిశలు కృషి చేస్తుందని మనుషుల మధ్య ప్రేమానుబంధాలను దేశభక్తిని నిర్మాణం చేస్తుందని వ్యక్తి నిర్మాణమే దేశ నిర్మాణంగా భావించి వ్యక్తి నిర్మాణం దిశగా ఆర్ఎస్ఎస్ కృషి చేస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బస్తీ ప్రముఖ్ రాజేశ్వరరావు, గాజుల రవీందర్, కొత్త మహేందర్ రెడ్డి,

బద్దం రవీందర్ రెడ్డి, దేవసాని రమేష్, సార శ్రీనివాస్, స్వరాట్, లక్ష్మీపతి, సిహెచ్.శ్రీనివాస్, కుమార్, కొమురయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.